క్లుప్తంగా

విద్యుత్ చౌర్యం నేరం

కొండపి: విద్యుత్ చౌర్యం నేరమని మండల విద్యుత్ శాఖ అధికారి పువ్వాడ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించే వినాయక విగ్రహ మండపాల వద్ద విద్యుత్ వినియోగించేందుకు విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలా చలానా చెల్లించకుండా విద్యుత్ వినియోగిస్తే విద్యుత్ చౌర్యం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినాయక విగ్రహాలను మండపాలకు తీసుకొని వచ్చే సమయంలో విగ్రహాల ఎత్తు వల్ల కొన్ని ప్రదేశాల్లో విద్యుత్ వైర్స్ తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జనం శోభయాత్ర మార్గాల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండి విగ్రహాలకు ప్రమాదం జరిగే సందర్భంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

కనిగిరిరూరల్: పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పిల్లి కృష్ణ మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో అందరూ సహకరించాలన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. రసాయనాలు, హానికర రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌లతో తయారు చేసిన విగ్రహాలు వాడొద్దని తెలిపారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమవుతుందన్నారు. పట్టణ ప్రజలు మట్టి విగ్రహాలను వాడి పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పాటునిచ్చి, సహకరించాలని కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి కోరారు.

బాలికల వసతి గృహం పరిశీలన


బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని శివ నగర్ కాలనీలో బీసీ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఆదివారం పరిశీలించారు. బాలికల వసతి గృహం ఆవరణలో ఉన్న నాల్గు ప్రభుత్వ గదులు నిరుపయోగంగా ఉండి.. అధ్వాన్న పారిశుద్ధ్యంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయన్నారు. దీని వల్ల విద్యార్థినులకు కూడా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఈమేరకు మంత్రి డోలా వీరాంజనేయ స్వామి లిఖిత పూర్వకంగా విన్నవిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం


శ్రీ కృష్ణుని ఊరేగింపు

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని గొంగడిరెడ్డిపాలెం, వర్ధినేనివారిపాలెంలో ఆదివారం శ్రీకృష్ణునికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా గొంగడిరెడ్డిపాలెంలో కృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి చివరి రోజు గ్రామోత్సవం నిర్వహించారు. ఇందూ జ్ఞానవేదిక ఒంగోలు కమిటీ అధ్యక్షుడు మునగపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

35 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కంకణాల కృష్ణమోహన్


కొండపి: మండలంలోని కట్టావారిపాలెంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా దేవి వైద్యశాల డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ 40 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అందరూ ధ్యానం, యోగ వంటివి సాధన చేస్తూ ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలని అన్నారు. దీర్ఘకాలిక రోగులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ రావెళ్ల రాజారావు దంపతులు, గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల చెంచయ్య, మానికొండ వెంకటేశ్వర్లు, వీరమోసు మస్తాన్‌రావు, ఆరోగ్య శిబిర భవనదాత గుంటుపల్లి పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సిద్ధంగా ఉన్న విఘ్నేశ్వరుని ప్రతిమలు


విఘ్నేశ్వరుని ప్రతిమలకు తుది మెరుపులు దిద్దుతున్న కార్మికుడు


సిద్ధమవుతున్న గణనాథులు

ఏకదంతాయ.. భిన్నరూపాయ


విశిష్ట అలంకరణలో గణనాథుని విగ్రహమూర్తి

- వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- మండపాలకు తరలుతున్న బొజ్జ గణపయ్య విగ్రహాలు


అష్టబాహువుల అలంకరణలో గణనాథుని విగ్రహమూర్తి


గజవాహనంపై కొలువైన వినాయకుడు


నందివాహనంపై పరమేశ్వరునితో కొలువైన వినాయకుడు


ఆదిశేషు వాహనంపై గణనాథుని విగ్రహమూర్తి


వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విగ్రహ మండప ఏర్పాట్లు

కనిగిరిరూరల్/పామూరు:

వినాయకచవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పల్లె, పట్టణం, వీధి, కాలనీ అన్న తేడా లేకుండా వేడుకలు నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. సర్వగణాధీసుడైన విఘ్నేశ్వరుని ప్రతిమలు పలువిధాలుగా అందమైన, ఆకర్షణీయమైన ఆకృతుల్లో కళాత్మకంగా సిద్ధమయ్యాయి. హంస, నంది, వినాయకుడు, పార్వతీ పరమేశ్వరులతో, నెమలి, ఆదిశేషు, అష్టగజ వాహనంపై కొలువైఉన్న గణనాథుని విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రంగు రంగుల.. వివిధ రకాల ఆకృతుల, రూపాలంకరణ విగ్రహాల కొనుగోళ్లకు యువత ప్రాధాన్యమిస్తున్నారు. ఇప్పటికే పలువురు అడ్వాన్సులు ఇవ్వగా.. దూర ప్రాంతాలకు చెందిన వారు సోమ, మంగళవారాల్లో గణేష్ విగ్రహాలను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

విభిన్న రూపాల్లో..

గణేష్ ఉత్సవాలకు భారీ గణనాధులు సిద్ధమయ్యారు. ఉత్సావాల సందర్భంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు తయారీదారులు, కళాకారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. వివిధ ప్రాంతాలకు విగ్రహాలను తరలించేందుకు విగ్రహ కమిటీల సభ్యులు పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గం కేంద్ర మైన కనిగిరిలో మూడు చోట్ల తయారి దారులు నెల్లూరు, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన విగ్రహాల తయారు చేసి అమ్మకాలకు సిద్ధం చేశారు. 5 నుంచి 13 అడుగుల ఎత్తు విగ్రహాలను కనిగిరిలో తయారు చేశారు. 5 అడుగుల విగ్రహం రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు, 13, 14 అడుగుల విగ్రహం రూ.45 వేల నుంచి రూ 50 వేలకు అమ్మకాలు చేస్తున్నారు. డిమాండ్ ను బట్టి ధరల అమ్మకాలు జరుగుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది తయారీ సంఖ్య కొంచెం తగ్గించినట్లు చెప్తున్నారు. పట్టణంలో స్థానిక 9వ వార్డులో వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో 26 అడుగుల మహంకాళీ అవతారణలో గణేషుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. హైదరాబాద్ దూల్‌పేట నుంచి దాదాపు రూ 5.50 లక్షలు ఖర్చు పెట్టి విగ్రహాన్ని తీసుకొచ్చినట్లు విగ్రహ కమిటీ తెలిపారు. అలాగే పట్టణంలో పలు చోట్ల 13, 14 అడుగుల విగ్రహాల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు.

☛ పామూరులో రాజస్థాన్‌కు, మహారాష్ట్రకు చెందిన కళాకారులు వినాయకుని విగ్రహాలను వివిధ మోడళ్లలో తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పామూరులోని 3 విగ్రహ తయారీ కేంద్రాల్లో సమారు 270 వినాయక ప్రతిమలను తయారుచేశారు.

సత్సంగాన్ని మించిన ధ్యానం లేదు


మాట్లాడుతున్న అనీల్ కుమార్


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కాశిరెడ్డి, మహీధర్‌రెడ్డి

కనిగిరిరూరల్: సాయి సత్సంగాన్ని మించిన ధ్యానం మరొకటి లేదని మాజీ మంత్రులు మానుగుంట మహీధర్‌రెడ్డి, ముక్కు కాశిరెడ్డి అన్నారు. స్థానిక సాయిబాబా దేవస్థానంలో సద్గురు సాయి సేవా సమితి, షిర్డీ సాయి బాబా దేవస్థానం ఆధ్వర్యంలో సత్సంగ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. సాయి టీవి అనిల్ కుమార్ మాట్లాడుతూ సాయి సచ్ఛరిత్ర సారాంశం పారాయణం, చేయడంతో పాటు, అందులోని సాయితత్వాన్ని భక్తులు అనుసరించాలన్నారు. సాయి తత్వం- మానవత్వం, సాయి మార్గంలో మహిళా శక్తి అనే అంశం పై మాట్లాడారు. కార్యక్రమంలో సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, బాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, దేవకి వెంకటేశ్వర్లు, కమిటీ నాయకులు వాగిచర్ల వెంకటేశ్వర్లు, శింగరాజు మాలకొండేశ్వర రావు, మండ్లా వెంకటేశ్వర్లు, శ్రీరాం మురళీ, వీసీ రామశాస్త్రీ, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పెద్దన్న, నార్లపాటి సాంబ శివరావు, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి


రికార్డులు పరిశీలిస్తున్న కనిగిరి డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్

వీసీపల్లి: పెండింగ్ కేసులపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదు స్వీకరణ, ఇతర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసులు, పాత పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు గస్తీలు ముమ్మరం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈయన వెంట కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సై కోటయ్య, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా గోపూజ, మహానివేదన


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహ మూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జి ఆర్. నరసింహబాబు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరానికి 80 మంది హాజరు


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నాగేంద్రనాయక్

కొండపి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరానికి 80 మంది హాజరైనట్లు జిల్లా ప్రత్యేక విద్య కో ఆర్డినేటర్ నాగేంద్ర నాయక్ తెలిపారు. ముఖ్యఅతిథిగా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ పాల్గొని శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ నాగేంద్ర నాయక్ మాట్లాడుతూ శిబిరానికి హాజరైన దివ్యాంగులకు డిజేబిలిటీ కేటగిరి ప్రకారం స్క్రీనింగ్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సురేఖ, రామారావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ప్రత్యేక విద్యా స్కూల్ అసిస్టెంట్ హనుమంతరావు 6 మండలాల భవిత సెంటర్ ఐఆర్పీలు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు

వలేటివారిపాలెం: వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని వలేటివారిపాలెం ఎస్సై మదిరి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే డీజేలకు అనుమతులు తప్పనిసన్నారు. డీజేలకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వినాయకుని ఊరేగింపు సమయంలో నిమజ్జనం ఎక్కడ చేస్తామని తెలియపరిస్తే భద్రత కల్పిస్తామన్నారు. వినాయకుని మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా మండపాలు వద్ద కమిటీ సభ్యులు రాత్రి పూట బస చేయాలని తెలిపారు. మండల ప్రజలు వినాయక చవితి పండుగను ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య జరుపుకోవాలని ఆయన తెలిపారు. మండల ప్రజలకు ముందస్తుగా వినాయక చవితి శుభకాంక్షలు తెలియజేశారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి


పాకల బీచ్‌లో పర్యాటకుల సందడి

సింగరాయకొండ: పాకల బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి అధికంగా ఉంది. మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల పర్యాటకులు కుటుంబసభ్యులతో కలిసి వచ్చి తీరంలో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఎండతీవ్రతను తట్టుకునేందుకు సముద్రస్నానం చేసి సేదతీరారు. చిన్నారుల కోసం బీచ్‌లో కారు రైడింగ్ ఏర్పాటు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

కనిగిరిరూరల్: బాల్య వివాహాల నిర్మూలించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో ఆదివారం న్యాయ సేవాధికార సంస్థ, వీవీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు చిన్న వయసులో గర్భధారణ , దుష్పరిణామాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధిత చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్‌బాబు, నవకుమార్, శ్యాముల్ గెర్షోమ్, తిరుతపయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో చైర్మన్ గఫార్

రెండు హుండీల్లో చోరీ

గుడ్లూరు: ఆలయాల్లో దుండగులు రెచ్చిపోయారు. రెండు గ్రామాల్లోని ఆలయాల్లో దుండగులు హుండీలను పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఈఘటన మండలంలోని మండలంలోని చినలాటరిఫి, పెదలాటరిఫి గ్రామాల్లో ఆదివారం జరిగింది. ఎస్సై వెంకట్రావు వివరాల మేరకు.. చినలాటరిఫి, పెదలాటరిఫి గ్రామాల్లో దుండగులు రెండు చోట్ల రెండు చోట్ల హుండీలు పగులగొట్టి నగదును తీసుకొని హుండీ 200 మీటర్ల దూరంలో పడేశారన్నారు. సూమారు రూ.50 వేల నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.